# స్పందన లేని టెండర్

- నగరంలో అద్దె బస్సుల టెండర్లకు కొరవడిన స్పందన
- 340 బస్సులకు పిలిస్తే.. 50 బస్సులకే టెండర్లు ఖరారు
- రేపటి నుంచి సమ్మెకు ఆర్టీసీకి అల్టిమేటం
- నేడు ఓనర్లను మళ్లీ చర్చలకు పిలిచిన ఆర్టీసీ
- 'మహాలక్ష్మి'కి బస్సుల కొరత

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రం ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణానికి బస్సుల కొరత తీవ్రంగా ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీకి చెందిన ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగుతో పాటు నగరంలో మెట్రో ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులలో ప్రయాణికులు పోటెత్తడంతో ప్రస్తుతం తిరుగుతున్న బస్సులు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో నగరంలో తక్షణ అవసరాల కోసం 340 అద్దె బస్సుల కోసం గత నెలలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ కేవలం 50 అద్దె బస్సులకు మాత్రమే ఓనర్లు టెండర్లు దాఖలు చేశారు. వాటిని మాత్రమే ఖరారు చేస్తూ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. కానీ మిగిలిన 290 అద్దె బస్సులకు టెండర్లు వేయడానికి యజమానులు ముందుకు రాలేదు. అయితే అద్దె బస్సుల యాజమానులు పలు డిమాండ్లను పరిష్కరించాలని ఆర్టీసీకి పలు మార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోక పోవడంతో ఈ నెల 5 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు అల్టిమేటం జారీ చేశారు. ఈ క్రమంలో 4న అద్దె బస్సుల ఓనర్లతో మరోసారి చర్చలు జరుపడానికి ఆర్టీసీ యాజమాన్యం ముందుకు వచ్చింది. అయితే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తేనే బస్సులు పెడుతామని లేదంటే తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ అద్దె బస్సు యాజమాన్యాల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అబ్బు మధుకర్‌రెడ్డి, గ్రేటర్ జోన్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే నగరంలో కొనసాగుతున్న 300 అద్దె బస్సులను సైతం నిలిపివేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## రెండు గ్యారంటీలను అమలు చేశాం

- ఆరు గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తాం
- ఉచిత ఆర్టీసీతో కోట్లాది మహిళలకు మేలు
- ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ) / కవాడిగూడ : ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమలు చేసిందని, మిగతా గ్యారంటీల అమలుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ సర్కిల్ భోలక్‌పూర్ వార్డులోని అంజుమన్ స్కూల్‌లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కౌంటర్‌ను కమిషనర్ రొనాల్డ్ రాస్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 10 లక్షల దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పెన్షన్, మహాలక్ష్మి, సబ్సిడీ గ్యాస్‌లకు సంబంధించిన దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి నేటితో నెల రోజులు పూర్తయ్యాయని, ఈ సమయంలోనే ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తెస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు ఆరున్నర కోట్ల మంది ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. ముషీరాబాద్ బోలక్‌పూర్ వార్డు పరిధిలో పద్మశాలీ కాలనీ, డీఎస్ నగర్, ఎస్‌బీఐ కాలనీ, దేవుడి తోట వాంబాయి క్వార్టర్స్ , మండి గల్లీ వరకు దరఖాస్తులు పూర్తయ్యాయని, మిగిలిన పీఅండ్‌టీ కాలనీ, సాయిబాబా నగర్‌లలో 4, 5వ తేదీల్లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, స్పెషల్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి, ముషీరాబాద్ ఎమ్మార్వో లక్ష్మి, ఆర్డీఓ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, కల్పనా యాదవ్, నాయకులు గుర్రం శంకర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లబెల్లి అంజిరెడ్డి, మేడీ సురేష్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా అభిలాష అభినవ్

- శంకరయ్యకు టీఎస్‌టీఎస్ ఎండీగా బాధ్యతలు

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా 2018 ఐఏఎస్ బ్యాచ్‌నకు చెందిన అభిలాష అభినవ్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన ఐఏఎస్ బదిలీల్లో భాగంగా అభిలాష అభినవ్‌ను జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. దీంతో పాటు జీహెచ్‌ఎంసీలో అడిషనల్ కమిషనర్ (ఎన్నికల విభాగం)గా పనిచేస్తున్న జె.శంకరయ్యను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు.

# రద్దీ మార్గంలో మెట్రో మాయం

- బీహెచ్‌ఈఎల్-మెహిదీపట్నం - లక్డీకాపూల్ మార్గాన్ని విస్మరించిన సర్కార్
- సోషల్ మీడియాలో నెటిజన్ల అసంతృప్తి



- సుమారు రూ.7089 కోట్లతో కేంద్రానికి డీపీఆర్ పంపిన కేసీఆర్ ప్రభుత్వం
- ట్రాఫిక్ అధ్యయనాల్లో అత్యధికంగా రాకపోకలు సాగించే మార్గంగా గుర్తింపు
- సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి పరిశీలన చేయాలంటున్న నగర వాసులు

## పత్తాలేని ప్రజా ప్రయోజనం

మెహిదీపట్నం వద్ద ట్రాఫిక్



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 3 (నమస్తే తెలంగాణ): 'అత్యధిక ప్రయాణికులకు అందుబాటులో మెట్రో రైలు'.. రెండు రోజుల కిందట హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ప్రధానమైన అంశమిది. దీని ప్రాతిపదికనే నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇంతవరకు బాగానే ఉంది.. కానీ వాస్తవానికి స్వయానా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) రూపొందించిన పలు అలైన్‌మెంట్లలో అత్యంత కీలకమైనది బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్ మార్గం. అత్యధికంగా ప్రయాణికులు ఉండటంతో పాటు నిత్యం లక్షలాది మంది వాహనదారులు ప్రస్తుతం ట్రాఫిక్ నరకాన్ని అనుభవిస్తున్నది కూడా ఈ మార్గంలోనే. వీటన్నింటికీ మించి హెచ్‌ఎంఆర్‌ఎల్ గతంలోనే ఈ అలైన్‌మెంట్‌పై అధ్యయనం పూర్తి చేసి, సమగ్ర ప్రాజెక్టు నివేదికను కూడా రూపొందిస్తే కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక సాయం కోసం కేంద్రానికి కూడా ప్రతిపాదనలు పంపింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ అలైన్‌మెంట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చి ఉంటే బాగుండేదని సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### దూరదృష్టితో కేసీఆర్ ప్రభుత్వం ఆమోదం

హైదరాబాద్ మహా నగరం నానాటికీ విస్తరించడంతో పాటు వాహనాల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది. దీంతో నివాసాలు శివారు ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధి, విద్య, వ్యాపార అవకాశాల కోసం లక్షలాది మంది నిత్యం ప్రధాన నగరం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా, సంస్కరణలు తీసుకువచ్చినా ట్రాఫిక్ జంఝాటం మాత్రం తగ్గడం లేదు. అందుకే కేసీఆర్ ప్రభుత్వం దూరదృష్టితో మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. అందులో భాగంగా భవిష్యత్తు అవసరాలకు కొన్ని ఉంటే.. ఇప్పటికిప్పుడు ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రూపొందించినవి కూడా ఉన్నాయి. వీటిలోనే మొదటి వరుసలో బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్ మార్గం ఉంది. ప్రస్తుతం ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-హైటెక్ సిటీ మార్గాల్లో మెట్రో ఉండగా.. ఇక్కడ ట్రాఫిక్ గణనీయంగా ఉంటుంది. ఇదే క్రమంలో లక్డీకాపూల్ తర్వాత మెహిదీపట్నం వైపు గచ్చిబౌలి.. దాని మీదుగా బీహెచ్‌ఈఎల్ వరకు విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో మెట్రో అందుబాటులోకి వస్తే నగరవాసులకు ట్రాఫిక్ కష్టాల నుంచి ఎంతో ఉపశమనం కలిగేది.

### కేంద్రం దగ్గర సిద్ధంగా డీపీఆర్..

రెండు రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో పలు ప్రాజెక్టులపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్ మార్గంపై గతంలోనే హెచ్‌ఎంఆర్‌ఎల్ అధ్యయనం చేయడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా పూర్తి చేసింది. అందులో ఈ మార్గంతో పాటు ఐదు కిలోమీటర్ల ఎల్బీనగర్-నాగోల్ అనుసంధాన అలైన్‌మెంట్ కూడా చేర్చి పంపారు. రెండింటి అంచనా విలువ రూ.8453 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్ 26 కిలోమీటర్ల మెట్రో మార్గానికి సుమారుగా రూ.7,089 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. అయితే దీనికి సంబంధించిన డీపీఆర్ కేంద్రం వద్ద ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్రంతో సంప్రదింపులు చేస్తే నిధులు వచ్చే అవకాశముంది. ముఖ్యంగా ప్రజా ప్రయోజన కోణంలో చూస్తే కూడా ఈ మార్గం ఎంతో కీలకమైనది. ఒకవైపు వాహనదారులకు ట్రాఫిక్ గండం నుంచి గట్టెక్కించడంతో పాటు ప్రధాన నగరంలోని లక్డీకాపూల్ నుంచి నేరుగా గచ్చిబౌలి దగ్గర అవుటర్ రింగు రోడ్డుకు అనుసంధానం ఏర్పడుతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై దృష్టి సారిస్తే బాగుంటుందనే డిమాండ్ వినిపిస్తుంది. బుధవారం సామాజిక మాధ్యమాల్లో కూడా దీనిపై విస్తృతంగా చర్చ జరిగింది. నెటిజన్లు అత్యధిక మంది సీఎం రేవంత్ నిర్వహించిన సమీక్షలో ఈ మార్గాన్ని చేర్చకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### బీహెచ్‌ఈఎల్ -మెహిదీపట్నం -లక్డీకాపూల్ మెట్రో మార్గాన్ని మరోసారి పరిశీలించాలి

నగరంలోనే అత్యధిక సంఖ్యలో రాకపోకలు ఉండే మార్గాల్లో ఒకటి బీహెచ్‌ఈఎల్-మెహిదీపట్నం-లక్డీకాపూల్. ఈ విషయాన్ని గుర్తించిన గత ప్రభుత్వం దీనిపై అధ్యయనం చేపట్టి, సమగ్ర పాజెక్టు నివేదికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. దీనిపై గత మూడేండ్లుగా తీవ్ర స్థాయిలో కసరత్తు జరిగింది. ఇంత జరిగిన తర్వాత కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్ మెట్రో మార్గాన్ని పరిశీలనలోకి తీసుకోకుండా కొత్త మార్గాల్లో మెట్రోను నిర్మిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటిగా లక్డీకాపూల్, మెహిదీపట్నం, గచ్చిబౌలి ప్రాంతాలు ఉన్నాయి. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డి మెట్రో ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చెబుతూనే, బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్ మెట్రో మారాన్ని ఏక పక్షంగా రద్దు చేసినట్లుగా కనిపిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం లక్డీకాపూల్, మెహిదీపట్నం మీదుగా గచ్చిబౌలి వరకైనా ఒక మెట్రో మార్గాన్ని నిర్మించేందుకు మరోసారి పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.

– ఇనగంటి రవికుమార్, సామాజికవేత్త, ఆర్టీఐ కార్యకర్త

### కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్నా..?

ఎన్నికల్లో గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. అందుకు ప్రత్యేక నిదర్శనం నవంబర్ 17న 'అభయ హస్తం' పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో హైదరాబాద్ విజన్ 2030 పేరుతో ఒక అంశాన్ని చేర్చి నగరానికి సంబంధించి చేపట్టే పథకాలను, కార్యక్రమాలను ప్రస్తావించింది. మ్యానిఫెస్టోలోని 39వ పేజీలో మెట్రో మార్గానికి సంబంధించి ' ఎల్బీనగర్ నుంచి బీహెచ్‌ఈఎల్ (వయా ఆరాంఘర్-మెహిదీపట్నం-గచ్చిబౌలి) రూట్లలో కొత్త మెట్రో లైన్లను విస్తరింపచేస్తాం' అని పేర్కొన్నారు. ఎంతో స్పష్టంగా పేర్కొన్న ఈ రూట్‌ను తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో చేపడతామని ప్రకటించిన మెట్రో రూట్లలో ఎక్కడా కనిపించలేదు. కేవలం నాగోల్ నుంచి ఆరాంఘర్ వరకు తీసుకువచ్చి వదిలేస్తున్నది. అక్కడి నుంచి అత్తాపూర్ మీదుగా మెహిదీపట్నం, టోలిచౌకి, గచ్చిబౌలి వరకు ఉన్న మార్గాన్ని పరిగణలోకి తీసుకోలేదు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో అత్యధికంగా ట్రాఫిక్ ఉండడంతో నిత్యం నగర వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా కాంగ్రెస్ పార్టీ చెప్పేదొకటి.. చేసేది మరొకటి అన్నట్లుగా మారింది.

# కొనసాగిన ఇంధన కష్టాలు

### బంకుల వద్ద బారులు.. ట్రాఫిక్‌కు అంతరాయం




ర్యాలీ నిర్వహిస్తున్న లారీ ఓనర్స్ సంఘాల ప్రతినిధులు

సిటీబ్యూరో, జనవరి 3 ( నమస్తే తెలంగాణ) : ఇంధన కష్టాలు బుధవారం కూడా కొనసాగాయి. మంగళవారం దేశ వ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు 'హిట్ అండ్ రన్' నిబంధనలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడంతో బంకులు బంద్ అవుతాయంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలతో వాహనదారులు భారీగా తరలివచ్చి అవసరానికి మించి తమ వాహనాల్లో, క్యాన్లల్లో పెట్రోల్ పోయించుకున్నారు. అప్పటికే కొన్ని బంక్‌లు నో స్టాక్ బోర్డులు సైతం ఏర్పాటు చేశాయి. కాగా, మంగళవారం కూడా గ్రేటర్‌లోని సికింద్రాబాద్, దిల్‌షుక్‌నగర్, తార్నాక తదితర బంకుల్లో పెట్రోల్ అందుబాటులో లేదు. దీంతో వాహనదారులు కనిపించిన పెట్రోల్ బంకుల వద్ద ఇంధనం కోసం క్యూ కట్టారు. అక్కడక్కడ ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తింది.

### హిట్ అండ్ రన్‌కు వ్యతిరేకంగా..!

మరోవైపు నగరంలో కేంద్రం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టంలోని హిట్ అండ్ రన్ నిబంధనలకు వ్యతిరేకంగా వాహన సంఘాలు ఆందోళన చేపట్టాయి. నిబంధనలను ఎత్తివేయాలంటూ సంఘాల నాయకులు డిమాండ్ వ్యక్తం చేశారు. బిల్లు పేపర్లను డ్రైవర్లు దహనం చేశారు. రాణిగంజ్ మిని గూడ్స్ వెహికిల్ యూనియన్, భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి శంకర్, హబీబ్, జహంగీర్, మనోజ్, పెంటయ్య, నంద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





# బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి

### ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులను పరిశీలించిన కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జనవరి 3 (నమస్తే తెలంగాణ): మూసీ నదిపై రూ.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ముసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ముందుగా చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఎఫ్‌సీఐ గోడౌన్ వరకు చేపట్టనున్న రోడ్డు నిర్మాణం కోసం రైల్వే, ఫారెస్ట్, ఎస్ఆర్‌డీపీ ఉన్నతాధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం ముసారాంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. త్వరగా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఈఎన్‌సీ జియావుద్దీన్, ఎస్ఆర్‌డీపీ సీఈ దేవానంద్ , ఎస్ఈ రవీందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కమలానగర్‌లో అసంపూర్తిగా ఆగిన కమ్యూనిటీహాల్ (ఫంక్షన్ హాల్ పనులు)

# ఎందుకీ నిర్లక్ష్యం..?

- జిల్లెలగూడ కమలానగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో.?
- ఎస్సీ సబ్‌ప్లాన్, జనరల్, ఎల్‌ఆర్‌ఎస్ కింద రూ.64 లక్షలు కేటాయింపు
- అధికారుల నిర్లక్ష్యంతో నిధులున్నా ముందుకు సాగని పనులు
- రెండేళ్లు గడిచినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే
- నిర్ణీత సమయంలో ఖర్చు కాకపోవడంతో నిధులు వెనక్కి
- అధికారుల తీరుపై కాలనీవాసుల అసహనం



కమ్యూనిటీ హాల్ నిర్మాణంకోసం 2021లో ప్రారంభించిన శిలాఫలకం

బడంగ్‌పేట, జనవరి 3 : ఈ ఫొటో చూశారా?! మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ 39వ డివిజన్‌లోని కమలానగర్‌లో రెండేళ్ల కిందట ప్రారంభమైన కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఇది. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించనట్లు.. అధికారుల నిర్లక్ష్యం ఈ నిర్మాణానికి గ్రహణంలా పట్టుకున్నది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిరుపేదల కోసం ఎస్సీ సబ్ ప్లాన్, జనరల్ ఫండ్, ఎల్ఆర్ఎస్.. ఇలా మూడు పద్దుల కింద రూ.64 లక్షలు సమకూర్చి అందుబాటులో ఉంచినా.. కేవలం అధికారుల నిర్లక్ష్యం, వారిలో లోపించిన చిత్తశుద్ధి కారణంగా రెండు సంవత్సరాలుగా ఆ డివిజన్ ప్రజలను ఈ అసంపూర్తి నిర్మాణం వెక్కిరిస్తూనే ఉంది. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు చిన్నపాటి వేడుకలను చిన్న ఇంట్లో చేసుకోలేక.. లక్షల రూపాయలు వెచ్చించి ఫంక్షన్ హాల్స్ బుక్ చేయలేక.. ప్రభుత్వపరంగా ఈ కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి రాక.. సతమతం అవుతున్నారు.

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ కమలానగర్ 39వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 2021, అక్టోబర్ 26న అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ముందుగా ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.30 లక్షలు కేటాయించారు. ఆ నిధులు సరిపోవని అధికారులు చెబితే.. జనరల్ ఫండ్, ఎల్ఆర్ఎస్ కింద మరో రూ.34 లక్షలను కూడా మంజూరు చేయించారు. అయినా అధికారులకు నిరుపేదల పట్ల కనికరం లేకుండా పోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని నిధులు వెనక్కిపోయాయి. పైగా గతంలో అనేకసార్లు సబితా ఇంద్రారెడ్డి పనుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల్లో మాత్రం చలనం రాలేదు. అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోవద్దనే ఉద్దేశంతో స్థానిక కార్పొరేటర్ మాదారి సురేఖ రమేశ్ పలుమార్లు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో మరో రూ.10 లక్షల జనరల్ ఫండ్ నిధులు కేటాయించినా పనులు మాత్రం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉన్నాయి. దీంతో రూ.24లక్షల ఎల్ఆర్ఎస్ నిధులు, జనరల్ నిధుల నుంచి రూ.10 లక్షలు నిధులు కూడా ఇప్పుడు వెనక్కి వెళ్లే ప్రమాదముందని కార్పొరేటర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలైనా నిర్మాణం పూర్తి కాకపోవడంపై డీఈని సంప్రదించగా.. పొంతనలేని సమాధానాలు చెబుతున్నారే తప్ప ఫలితం ఉండటం లేదన్నారు. కాంట్రాక్టర్ పనులు చేయకపోగా... అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. కాగా ప్రస్తుతం ఇంజినీరింగ్ అధికారులు అందుబాటులో లేరని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని కమిషనర్ వాణి తెలిపారు.